

(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

-186-

(27 మే 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

వేసవి కాలంలో వుండే ఇబ్బందులతోపాటు, కొన్ని నీళ్ళు కూడా వున్నాయి. అన్నింటికంటే వేసవిలో కొంత పొదుపరితనం ఏర్పడేమాట నిజం. కొందరుంటారు "వేసవిలో పొదపరితనమేమిటి? శీతల పానీయాలు, ఎయిర్‌కండిషన్ గదులు, మల్లెపూల తోరణాలు, మామిడిపళ్ళ సంతర్పణలు – అంతా ఖర్చుతో సంబంధించిన విషయమేకదా " – అని.

నిజానికి ఇలాంటి వారి సంఖ్య చాలా తక్కువ వుంటుంది. సిరి చేతుల్లో వున్న వారి సల్లాపాలు వేరు – ఉల్లాసాలూ వేరు.. సిరిని చింతగింజల్లాగా ఎగరవెయ్యవచ్చు. చిద్విలాసంగా బ్రతకవచ్చు.

లేనివాళ్ళ మాటేమిటి. వారికి ఖర్చు భరించే శక్తి ఎక్కడనుంచి వస్తుంది. పైగా ప్రతి వస్తువు ధరా మండిపోతూ వుంటుందాయె. వడగాడ్పులో తిరిగి నాలుగు వస్తువులూ, తెచ్చుకునే అవకాశాలు వుండవాయె.

అసలు వస్తువులు ఇవి వున్నాయి. అవి లేవు. అనుకునేదాకా ఎక్కడ? "ఇవ్వాళ కూర ఏమీ లేదండీ" అని భార్యామణి అంటే "కూర లేకపోతేమానె.. ఈ ఇరవై రోజులూ అన్నీ పట్టించుకోకు. ఉన్నట్లుగానే గడిపివెయ్యి. ధరలూ అలాగే వున్నాయి. ఓపికలూ. అలాగే వున్నాయి. బయటికి వెళ్ళి ఇల్లు చేరేటప్పటికి వడిలిపోవడం కనిపించడంలా నీకు. ఇంకా అవీ ఇవీ తెమ్మని చెపుతావేం తీరుబడిగా" అని మందలించడం జరుగుతుంది భర్త.

"అలా కేకలేస్తారేమిటి? మీరు ఎండల్లో తిరగడం నాకు మాత్రం ఇష్టమేమిటి? కూరలేందే తినలేరుకదా – ఏదైనా చలవచేసే కూర తెస్తారేమోనని అన్నాను. మీరు కోప్పడితే నేనేం చెయ్యను. నాకు మాత్రం చేసే ఓపిక వుందేమిటి? పొయ్యి దగ్గరికి వెళ్ళడానికి భయంగా వుంది నుదురు పెనంలాగా వేడెక్కిపోతోంది" అని ఆమె సమాధానం.

"మరి ఇంకేం. ఏదో ఒకటి చేసి వూరుకోరాదూ! దేశం చల్లపడిన తర్వాత మెల్లమెల్లగా మళ్ళీ అన్ని వస్తువులూ తెచ్చుకుందాం. హాయిగా తిందాం. ఒకరి నవ్వులు ఒకరు విందాం" అంటాడాయన.

"అయితే రెండు అప్పడాలు కాలుస్తాను. ఇంత పులుసు పెడతాను. మాగిన చింతకాయ వుంది. వంటికి మంచిది. హాయిగా తినవచ్చు. కాసేపు నిద్రపోవచ్చు" అని ఆవిడగారి సలహా.

వేసవి గాడ్పుల ఎద్దడికి తట్టుకోలేక, బజారు వెళ్ళలేక, అంతంత ఖరీదులు భరించలేక ఆ గృహస్థు పొదుపరితనం మాటలు మాట్లాడాడుగాని మామూలు సమయాలలో అయితే మబ్బులు, మలయమారుతం, తొంగిచూచినప్పుడు మందహాసం చిందిస్తూ జీవించేటప్పుడయితే కూర లేదని తెలిస్తే నారసాలు వేసుకోడూ?

చింతకాయ పచ్చడి వేసుకుని తినమంటే శ్రీకృష్ణుడు దుష్టాత్ముల మీద చక్రం విసిరినట్లు సతీమణిమీద తన పరాక్రమ విక్రమమనే చక్రం వదలడూ. అదంతా గాడ్పులలో నుంచి వచ్చిన చలవ. తనంత తానుగా వస్తువులను గురించి తెలుసుకున్న విలువ.

ఎక్కడినుంచో పెళ్ళి పిలుపు వంటిది ఏదైనా వచ్చినా అట్టే ఆలోచించరు. ఒకవేళ ఇల్లాలు "వెడదామా పోనీ బాగుండదేమో" అంటే "వెడితే అసలు బాగుండదు. ఈ ఎండు మొఖాలతో ఎక్కడికి వెడతాం. ఇలా మంచినీళ్ళ కూజా ఒళ్ళో పెట్టుకుని కూర్చునే అవకాశం ఎక్కడ దొరుకుతుంది? ఒకసారి ఇలాగే మనం రోహిణిలో పెళ్ళికి వెళితే మధ్యాహ్నం భోజనం వీధి వరండాలో పెట్టాడు జ్ఞాపకం వుందా! అవ్వాళ ఎండ నూట పద్దెనిమిది డిగ్రీలు, ఇంట్లో వుంటే కిటికీలు తియ్యని వాళ్ళం. తిన్న తర్వాత కూడా వరండాలో పడి వున్నాం. అయిదింటికి రిక్షాలో రావడమే బ్రహ్మాండమైంది."

ఈ వేసవి పెళ్ళిళ్ళు పెళ్ళికూతురు, పెళ్ళికొడుకూ వాళ్ళిద్దరికీ సంబంధించిన మహోత్సవాలు.. అటు, ఇటూ దగ్గరవాళ్ళు తప్పదు గనుక ఆ రోజు పందిట్లో ఎండుటాకులాగా వ్రేలాడుతూ వుంటారు. అంతేగాని ఎరుగున్న వాళ్ళలా వెళ్ళడమంటే ఎండల్లో మాడటమన్న మాటే.

వాళ్ళు మర్యాదకు శుభలేఖ వేస్తారు. మనం మాట వరసకోసం సందేశం పంపిస్తాం. దాంతో సరి. వెళ్ళడమంటూ జరిగితే, మనం బాధపడుతూ వాళ్ళను నానాబాధ పెట్టాలి. వేసవి పెళ్ళిళ్ళకి కూడా ఎక్కడ వెడతాం. బయానా పుచ్చుకున్న భజంత్రీలే ఎగ్గొడతారు ఇలాటి పెళ్ళిళ్ళకు అని ఆయనగారు వివరించి చెపుతారు. దాంతో పెళ్ళి ఖర్చు తప్పిపోతుంది.

సినిమాలకనీ, ఊళ్ళో ఆ చివర ఎక్కడో వున్న చుట్టాల్ని చూసి వస్తామనీ, ఎవరో పేరంటానికి పిలిచారు వెళ్ళకపోతే బాగుండదనీ ఇలాటి ప్రయాణాలు చాలా తగ్గిపోతాయి మండుటెండల్లో. వాటివల్ల కొంత సొమ్ము దక్కుతుంది. మామూలు రోజుల్లో ఇలా చెప్పుకోగలిగితే పొదుపరితనం ఎందుకు ఏర్పడదూ.

ఉద్యోగాలు చేసేవారి మాట అలా వుంచి, తక్కినవారికి ఇస్త్రీ ఖర్చులు కూడా చాలావరకు తగ్గిపోతాయి వేసవిలో. ఎప్పుడు చూసినా ఒక లుంగీ, ఒక తువాలుతో తయారవుతూ వుంటారు. వేసవి వెళ్ళేదాకా బనీన్ల సంగతి కూడా చూడరు. చొక్కాలమాట అలావుంచి.

"వారానికి ఒక చొక్కా కంటె ఎక్కువ వాడటంలేదు. ఎక్కడికన్నా బైటికి వెడితేగా. కొంచెం కూరలకు వెళ్ళేటప్పుడు, పచారీ వస్తువులు కావలసినప్పుడు, చొక్కా తగిలించడం పావుగంటలో విప్పి వంకెన తగిలించడం, ఇస్త్రీ ఖర్చు చాలా తగ్గింది నెలలో" అని ఒకాయన సంబరాలు పడ్డాడు.

'ఎండల్లో ఎవరు చూడొచ్చారు? మనం ఎక్కడికి వెళ్ళివచ్చాం' అని కొందరు గడ్డాలు కూడా నాలుగైదులు పెంచడం జరుగుతూ వుంటుంది.

ఇలా వేసవి ఒక విధంగా విరాగి జీవితం కల్పిస్తుంది. ఇది ఎప్పుడూ వుంటే ఎంతో పొదుపు అనేమాట సత్యం.

Post your comments